క్లుప్తంగా

వలంటీర్ సేవలు భేష్

కోట: గూడలి సచివాలయం–2 పరిధిలోని విజయకాలనీకి చెందిన కడసూతల రమణమ్మ అనారోగ్య కారణాలతో నెల్లూరులోని కుమారుడి వద్ద ఉంటుంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సుధీర్ నెల్లూరుకు వెళ్లి రమణమ్మకు పింఛన్ నగదును అందజేశారు. వలంటీర్ సేవలను కుటుంబసభ్యులు ప్రశంసించారు.

పింఛన్లు త్వరితగతిన పంపిణీ చేయాలి

ఓజిలి: మండలంలో వైఎస్సార్ సామాజిక పింఛన్లను త్వరగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండలంలోని మాచవరం, తిరుమలపూడి, నగుటూరు పంచాయతీల్లో పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. మండలంలో 5,507 పింఛన్లకుగాను 5,215 పింఛన్లు పంపిణీ చేయడంతో 94.57 శాతం పూర్తి అయిందని తెలిపారు. గ్రామంలో లేని వారి వివరాలను తెలుసుకుని పంపిణీ చేయాలన్నారు.

పథకాల పోస్టర్లు విధిగా ప్రదర్శించాలి



రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

సైదాపురం: సచివాలయాల్లో సంక్షేమ పథకాల పోస్టర్లను విధిగా ప్రదర్శించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు కోరారు. మండల కేంద్రమైన సైదాపురం, చాగణం సచివాలయాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్లను సచివాలయాల గోడలకు తప్పక అంటించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారన్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు జవాబుదారీగా ఉంటూ సకాలంలో సేవలను అందించాలని సూచించారు.

సభ్యత్వ నమోదు చేయాలి

నాయుడుపేటటౌన్: ఆమ్ ఆద్మీ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ నీరుగట్టు నగేష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చందు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం వద్ద శుక్రవారం సూళ్లూరుపేట నియోజవర్గ ఇన్‌చార్జి పట్టపు రవి అధ్యక్షతన నియోజవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.

సింహవాహనంపై ప్రసన్న వెంకన్న



గూడూరు: స్థానిక రాజావీధిలో ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం రాత్రి సింహవాహనంపై విహరించారు. ఉదయం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు, ఉభయకర్తలు అశోక్ కుమార్, కమలాభాయి పాల్గొన్నారు.

ఘనంగా పూజలు



సైదాపురం: మండల కేంద్రంలో శ్రీకామాక్షిదేవి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు హోమాలు చేశారు.



● వృద్ధురాలైన రుద్రవరం పోలమ్మది వాకాడు మండలం వెంకటరెడ్డిపాళెం. ఈమె చంద్రబాబు హయాంలో పింఛన్ తీసుకోవడానికి నెల్లిపూడి పంచాయతీకి వెళ్లాల్సి వచ్చేది. పేరు పిలిచేంత వరకు అక్కడే కూడు, నీళ్లు లేకుండా నరకయాతన పడేది. నేడు సీఎం జగన్ పుణ్యమా అని తెల్లవారక ముందే తలుపు తట్టి ఆమె చేతిలో పింఛన్ పెడుతున్నారు వలంటీర్. పోలవ్వ మురిసిపోతుంది.



● వాకాడు జనార్దన్‌రెడ్డి కాలనీకి చెందిన ఎంబేటి నాగభూషణమ్మ వితంతువు. ఈమె భర్త సుమారు 20 ఏళ్ల ముందు మరణించాడు. కూలీ పనులే జీవనాధారం. టీడీపీ హయాంలో ఇచ్చే రూ.వెయ్యి పింఛన్ తీసుకోవడానికి రెండు, మూడు రోజులు కూలి పనులు మానుకుని ఆఫీసు వద్ద పడిగాపులు కాసేది. నేడు జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత వేకువ జామునే పింఛన్ తీసుకుని పనులకు వెళ్లిపోతున్నానని ఆనందం వ్యక్తం చేస్తోంది.

కష్టాలు గడప దాటించారు.. జగనన్న

నడవలేని స్థితి.. మంచమే గతి.. నరకయాతన.. బతుకు వేదన.. ఒంటరి జీవనం.. ఓర్చుకోలేని కష్టం.. ఎవరూ చూడరు.. ఏమీ సాయపడరు.. ఏం చేయాలి.. ఎలా బతకాలి.. కష్టాలు..కన్నీళ్లే మిగిలిన సమయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభాగ్యులకు ఆపన్న హస్తం అందించారు. వేకువజామునే ఇంటి ముంగిటే పింఛన్ అందింది.. నిస్సహాయుల్లో ఆనందం నిండింది.



టీడీపీ హయాంలో పింఛన్ కోసం పడి గాపులు



ఇంటి వద్దనే పింఛన్ అందజేస్తున్న వలంటీర్

సచివాలయం	లబ్ధిదారుల సంఖ్య	పింఛన్ మొత్తం (రూ.లక్షల్లో..)
బాలిరెడ్డిపాళెం	393	10.94
దుగ్గరాజపట్నం	466	12.89
జమిన్‌కొత్తపాళెం	457	12.68
కల్లూరు	417	11.81
కొండాపురం	355	9.91
కొండూరు	372	10.38
నెల్లిపూడి	512	14.22
నిడిగుర్తి	493	13.72
పూడిరాయిదొరువు	578	16.10
తిరుమూరు	376	10.35
వాకాడు-1	488	13.59
వాకాడు-2	503	14.08

- ఒకటో తేదీ వేకువనే పింఛన్
- ఇంటి ముంగిటే పంపిణీ
- లబ్ధిదారులకు తప్పిన తిప్పలు
- అర్హతే ప్రామాణికంగా ఎంపిక

వాకాడు: గత టీడీపీ ప్రభుత్వంలో అవ్వాతాతలు మైళ్ల కొద్దీ దూరం వెళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాసి సొమ్మసిల్లి పింఛన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఒకటో తారీఖున కోడి కూయకముందే, ఇంటి ముంగిటే పింఛన్ అందిస్తోంది. దీంతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తోంది. టీడీపీ హయాంలో పింఛన్ కోసం మూడు రోజుల నుంచి 5 రోజుల వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. కొన్ని సార్లు డబ్బులు లేవని మరుసటి నెలలో ఇచ్చేవారు. అయితే నేడు ఒక రోజులోనే పింఛన్ పంపిణీ పూర్తి చేస్తున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలో 3,455 మందికి మాత్రమే రూ.54.55 లక్షలు పింఛన్ వచ్చేది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా మండలంలో 5,410 మందికి రూ.1.50 కోట్లు ప్రతి నెలా పింఛన్ అందుతోంది.

చారిత్రాత్మకంగా పింఛన్ పంపిణీ



ఎప్పుడు లేని విధంగా ఈ ప్రభుత్వంలో పింఛన్ పంపిణీ చారిత్రాత్మకంగా జరుగుతుంది. ప్రతినెలా ఆఖరు రోజునే పింఛన్ పంపిణీకి వలంటీర్లుతో సమావేశం ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పింఛన్ల పంపిణీ జరిగేలా నేను కూడా వలంటీర్లుతో కలసి చర్యలు తీసుకుంటున్నాను. –గోపీనాథ్, ఎంపీడీఓ, వాకాడు

ముందురోజే పింఛన్ పంపిణీకి కసరత్తు



ఉన్నతధికారుల ఆదేశాల మేరకు ఒకరోజు ముందు నుంచే పింఛన్ల పంపిణీకి కసరత్తు చేస్తున్నాం. వలంటీర్లకు అవసరమైన పింఛన్ నగదు వివరాలు ముందుగానే అందజేస్తున్నాం. ప్రతి ఒక్కరికీ సకాలంలో వలంటీర్లు పింఛన్ అందజేస్తున్నారు. అవ్వా, తాతల నుంచి ఎలాంటి ఫిర్యాదులు కార్యాలయానికి రావడం లేదు. –అట్ల సుధాకర్ వెల్ఫేర్ అసిస్టెంట్, వాకాడు–1

అవ్వాతాతలకు సేవ చేసే అదృష్టం



ఒకటో తేదీ ఉదయం 5 గంటల నుంచే అవ్వాతాతలకు సేవ చేసే అదృష్టం లభించింది. అవ్వాతాతలకు పింఛన్ అందజేస్తే వారి ముఖంలో బోసి నవ్వు చూసి మేమూ సంతోష పడుతున్నాం. ఎవరైనా అనారోగ్యంతో బయట ప్రాంతాల్లోని ఆస్పత్రిలో ఉంటే వారికి అక్కడకే వెళ్లి పింఛన్ అందజేస్తున్నాను. –వంజివాక గణేష్, వలంటీర్, వాకాడు

ప్రతి సోమవారం 'జగనన్నకు చెబుదాం'

సైదాపురం: ప్రతి సోమవారం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమక్షంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్ శ్రీనివాసులు తెలిపారు. అధికారులందరూ ప్రజలకు ఆ రోజు అందుబాటులో ఉండి అప్పటికప్పుడే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తారన్నారు. 5వ తేదీ నుంచి సైదాపురం తహసీల్దార్ కార్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

రాపూరులో..

రాపూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అన్ని శాఖల మండల అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని చెప్పారు.

విద్యాకానుక కిట్ల పరిశీలన



కిట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో చంద్రముని

నాయుడుపేట: జగనన్న విద్యాకానుక కిట్లను సూళ్లూరుపేట ఆర్డీఓ చంద్రముని శుక్రవారం పరిశీలించారు. నాయుడుపేట ఎమ్మార్సీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాకానుక కిట్ల వివరాలను తెలుసుకున్నారు. కిట్ల డిస్‌ప్లే బోర్డులను కూడా పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, ఎంఈఓ కోమలాదేవి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేసి, సమస్యలను అడిగి తెలుసుకుంటున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: సమస్యల పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని మూడో వార్డు సాలెకాలనీ, బీసీ కాలనీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లను అందజేసి, నాలుగేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందించిన సంక్షేమ లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అవినీతికి ఆస్కారం లేకుండా అందిస్తున్నట్లు తెలిపారు. పరిపాలనా వ్యవస్థలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టారని, గత ప్రభుత్వానికి, ఇప్పటి ప్రభుత్వానికి తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పి ప్రభావతి, ఎంఏ నారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు కాసుల శివకుమార్, కౌన్సిలర్ వహీదా, నేతలు టి గణేష్ రెడ్డి, సూరి, వలికల కృష్ణయ్య, నాగరాజు, వి జనార్దన్, మున్సిపల్ కమిషనర్ బివి రామయ్య పాల్గొన్నారు.

సీఎం జగనన్న పాలన ఓ స్వర్ణయుగం



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

ఓజిలి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో స్వర్ణయుగం నడుస్తోందని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మాచవరం సచివాలయం పరిధిలోని కుందాం, కుందాం రాచపాళెం, ఏనుగువాడ, తిరుమలపూడి గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. వృద్ధులతో మాట్లాడిన ఎమ్మెల్యే పింఛన్ అందుతుందా? వలంటీర్లు మీ ఇంటికి వస్తున్నారా? సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా అని ఆరా తీశారు. అనంతరం డ్రైనేజీ, సిమెంట్‌రోడ్డు వంటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సీసీరోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని ఎంపీడీఓ రజనీకాంత్‌ను ఆదేశించారు. జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు, కుందాం పీఏసీఎస్ అధ్యక్షుడు ఎద్దల రాజారామిరెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ పాకనాటి ప్రవీణ, ఎంపీటీసీ సభ్యులు ఎన్ సంధ్య, కొట్టు శేఖర్, సర్పంచ్‌లు ఎద్దల కనకదుర్గారమణి, ఏకసిరి గోపాలయ్య, నాయకులు ఈశ్వర్‌రాజు రామచంద్రరాజు, పాదర్తి రాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు నగుటూరులో గడప గడపకు..

మండలంలోని సగుటూరు, వడ్డిపాళెం, వీర్లగునపాడులో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు జీ రవీంద్రరాజు తెలిపారు.

ఐదుగురు కానిస్టేబుళ్లు బదిలీ

తడ: జిల్లా వ్యాప్తంగా జరిగిన పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీల్లో భాగంగా శుక్రవారం తడ పోలీస్ స్టేషన్ నుంచి ఐదుగురు కానిస్టేబుళ్లు బదిలీ అయ్యారు. ఐదేళ్ల పాటు ఒకే పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న పార్థసారథి, గిరీష్, సుబ్రమణ్యం, రామ్మోహన్, శ్రీనివాసులు, కవిత బదిలీపై వెళ్లారు. వీరికి ఎస్‌ఐ జేపీ శ్రీనివాసరెడ్డి, ఇతర సిబ్బంది వీడ్కోలు పలికారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

సైదాపురం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పీఏసీఎస్ అధ్యక్షుడు బి.శివకుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను రైతులకు ఏఓ హైమావతి అధ్యక్షతన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కర్షకులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారన్నారు. ఏఓ మాట్లాడుతూ రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలను అందిస్తున్నట్లు తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లండి



మాట్లాడుతున్న తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్

చిల్లకూరు: భూ సేకరణలో రైతులు తెలియజేస్తున్న అభ్యంతరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ అజ్మతుల్లాఖాన్ తెలిపారు. మండలంలోని చింతవరం సచివాలయంలో శుక్రవారం సాగరమాలకు భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి వారితో విడివిడిగా మాట్లాడారు. ఈ ప్రాంతంలో సెటిల్‌మెంట్ పట్టా భూమి ఎకరం రూ.20 లక్షల వరకు పలుకుతుందని, అయితే భూ సేకరణలో రూ.11.65 లక్షలు మాత్రమే ఇస్తామనడంతో నష్టపోతున్నామని ఈ సందర్భంగా తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. డీకేటీ పట్టాలు ఉన్న వారికి ఎకరాకు రూ. 8లక్షలు మాత్రమే పరిహారం ఇస్తున్నారని, దాన్ని ఇంకా పెంచాలని కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ మరోసారి రైతులతో సమావేశం నిర్వహిస్తామని అలాగే రైతుల అభ్యంతరాలను ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పక్కాగృహాలకు చెందిన లబ్ధిదారులకు పొజిషన్ సర్టిఫికెట్లు మంజూరు విషయంపై చింతవరం ఎంపీటీసీ సభ్యురాలు పాలూరు మాధవి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి అందరికీ సర్టిఫికెట్లు మంజూరు చేస్తామన్నారు. ఆయన వెంట వీఆర్‌ఓ జగదీష్ తదితరులు ఉన్నారు.

కరిమాణిక్యస్వామికి స్వర్ణ గరుడ సేవ



స్వర్ణ గరుడ వాహనంపై స్వామివారు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులో ఉన్న కరిమాణిక్యస్వామివారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి స్వామివారు స్వర్ణ గరుడ వాహనంలో విహరించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సహస్రనామార్చన, బలిహరణం, ద్వారదర్శన పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం జరిపారు. రాత్రి ఊంజల్ సేవ, ఏకాంతసేవ పూజలను ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి ఆధ్వర్యంలో జరిపారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ద్వారదర్శన పూజల్లో ఆలయ మాజీ ట్రస్టీ కే రామకృష్ణారెడ్డి, కే మోహన్‌రెడ్డి, నరసారెడ్డ, పీ గంగా ప్రసాద్, సురేష్‌రెడ్డి, టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు హరిరెడ్డి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

మేరి వృద్ధాశ్రమానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత చంద్రమౌళి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని మేరి వృద్ధాశ్రమానికి స్థానిక విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రమౌళి రూ.10 వేలు నగదు విరాళం ఇచ్చారు. ఈ మొత్తాని శుక్రవారం ఆశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. సినిమా సంగీత దర్శకుడు ఇళయారాజా జన్మదినం సందర్భంగా ఆయన వీరాభినిగా ఆశ్రమంలో వృద్ధులకు తనవంతుగా చేయూతను అందించినట్లు చంద్రమౌలి తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు సునీతా, బెన్నిలు దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎండలు..బాబోయ్..ఎండలు



చెట్టు నీడన సేదతీరుతున్న వృద్ధులు



పట్టణంలోని జన సంచారం లేని రోడ్డు

గూడూరు: జూన్ నెల వచ్చినా ఎండల తీవ్రత రోజు రోజుకూ పెరుగుతుందే తప్ప, తగ్గడం లేదు. దీంతో మధ్యాహ్నం అయితే పట్టణంలోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. నిత్యం వాహనాల రొదతో రద్దీగా ఉండే జాతీయ రహదారి కూడా బోసిపోతోంది. ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు ఎక్కువై బయటకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. వ్యాపారాలు కూడా లేక, పలు ప్రాంతాల్లోని దుకాణాలు సైతం మూతపడుతున్నాయి. ఎండల తీవ్రతకు ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

విలవిల్లాడుతున్న పండుటాకులు

రోజురోజుకూ భానుడు భగభగలాడుతున్నాడు. దీంతో వృద్ధులు వేడికి తట్టుకోలేక విలవిలలాడుతున్నారు. ఎక్కడ నీడ కనబడితే అక్కడ సేదతీరుతున్నారు. ఈ క్రమంలోనే భిక్షాటన చేస్తూ పొట్టుపోసుకుంటున్న వృద్ధ మహిళలు శివాలయం సమీపంలోని ఓ చెట్టు నీడన నేలపైనే పడుకుని సేదతీరుతూ కనిపించారు.

అర్బన్ మార్కెట్ ప్రారంభం



మార్కెట్‌ను ప్రారంభిస్తున్న బాలచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలో చెంగాళమ్మ ఆలయం ఎదురుగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను చెంగాళమ్మ ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మెప్మా డీఎంసీ జయరామ్ మాట్లాడుతూ పొదుపు సంఘాల సభ్యులు తయారు చేసిన వస్తువులు విక్రయించడానికి రెండు రోజులు పాటు అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. త్వరలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఫిష్ ఆంధ్రా ప్రోగ్రాం కింద నాలుగు షాపులు ఇక్కడ ప్రారంభించాలని, దీనికి 60 శాతం సబ్సిడీ వస్తుందని తెలిపారు. సీఓ నారాయణమ్మ, హనుమాయి, టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు పీ స్వప్న పాల్గొన్నారు.

నిమ్మచెట్ల తొలగింపుపై వీఆర్వోతో మహిళల వాగ్వివాదం



వీఆర్వోతో వాగ్వివాదం చేస్తున్న మహిళలు

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): బాలాయపల్లి మండలంలోని రామాపురంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఆ గ్రామానికి చెందిన కొందరు నిమ్మ చెట్లు నాటడంపై స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ చెట్లను తొలగించారు. దీంతో స్థానిక మహిళలు శుక్రవారం బాలాయపల్లి రెవెన్యూ కార్యాలయం వద్దకు చేరుకుని సంబంధించిన వీఆర్వోతో చెట్లను ఎలా తొలగిస్తావంటూ వాగ్వివాదానికి దిగారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా రామాపురం గ్రామంలో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని, ఆ భూమిలో ఎవరు దిగకూడదని చెప్పారు. ఈ విషయమై గతంలో బోర్డు నాటినట్లు చెప్పారు. అయితే గ్రామంలో రెండు వర్గాల ప్రజలు ఆ భూమిని స్వాధీన పరుచుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు.

ఏరియేటర్ల చోరీపై ఫిర్యాదు

కోట: తన ఇంటి వద్ద ఉంచిన ఏరియేటర్ల చోరీ జరిగాయని దైవాలదిబ్బకు చెందిన ఆక్వా రైతు ఆదెయ్య శుక్రవారం ఎస్‌ఐ పుల్లారావుకు ఫిర్యాదు చేశాడు. ఇంటి వద్ద ఉంచిన రూ.2 లక్షలు విలువ చేసే పది ఏరియేటర్లను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.